ప్రజా విశ్వంభర
V3 NEWS లక్ష్యం సమాజహితం

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు.. గ్రామాల అభివృద్ధే లక్ష్యం

## ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



విశ్వంభర, అబ్దుల్లాపూర్‌మెట్: కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. గురువారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో హెచ్ఎండీఏ, ఎన్ఆర్ఈజీఎస్‌కు చెందిన రూ.4.25 కోట్ల నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. అబ్దుల్లా పూర్ లో రూ.25 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన, రూ.50 లక్షలతో నిర్మించిన భూగర్భ డ్రైనేజీని ప్రారంభించారు. కవాడిపల్లిలో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, బండరావిరాలలో రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. చిన్నరావిరాలలో రూ.10 లక్షలతో నిర్మించిన వీవో బిల్డింగ్‌ను ప్రారంభించడంతో పాటు రూ.20 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఇనాంగూడలో రూ.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, పిగ్లీపూర్‌లో రూ.25 లక్షలతో, బాటసింగారంలో రూ.75 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. మజీద్‌పూర్‌లో రూ.25 లక్షలతో, గుంతపల్లిలో రూ.25 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. లష్కర్‌గూడలో రూ.15 లక్షలతో, గండిచెరువులో రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. గండిచెరువులో మరో రూ.20 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని తెలిపారు. గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమన్నారు. గత రెండున్నరేళ్లలో రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.700 కోట్లకు పైగా నిధులు తీసుకొచ్చినట్లు వెల్లడించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని గతంలో యథేచ్ఛగా కబ్జాలకు పాల్పడిన మాజీ ఎమ్మెల్యే.. నేడు కబ్జాల గురించి మాట్లాడటం దొంగే దొంగ అన్నట్లుగా ఉందని విమర్శించారు. అనంతరం పిగ్లీపూర్‌లో నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి, లబ్ధిదారులైన దంపతులకు నూతన వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కరచారి, బాటసింగారం సహకార సంఘం చైర్మన్ కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, అబ్దుల్లాపూర్ సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం, కవాడిపల్లి సర్పంచ్ కొలన్ ప్రసన్న రవీందర్‌రెడ్డి, బండరావిరాల సర్పంచ్ కందికంటి విజయ్‌కుమార్, చిన్నరావిరాల సర్పంచ్ పబ్బతి బాలకిషన్‌గౌడ్, పిగ్లీపూర్ సర్పంచ్ కోట ప్రభాకర్‌రెడ్డి, లష్కర్‌గూడ సర్పంచ్ అలె అయిలయ్య యాదవ్, గండిచెరువు సర్పంచ్ జక్క రవీందర్‌రెడ్డి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వాళ్లకు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయం: ఆర్ఎస్పీ




విశ్వంభర, తెలంగాణ బ్యూరో: తెలంగాణ పరిపాలనలో చీకటి అధ్యాయమని.. ఒక్క రోజే 8 జీవోల అమలును నిలిపివేస్తూ హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. దీనికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వమే కారణమన్నారు. కళ్యాణలక్ష్మి ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు ఉపయోగ పడిందని.. రేవంత్ ప్రభుత్వం కుట్రపూరితంగా వెరిఫికేషన్ చేయాలని కళ్యాణలక్ష్మి పథకాన్ని ఆపిందని ఆరోపించారు. రోజుకు 18 గంటలు రివ్యూలు చేసే సీఎం రేవంత్‌రెడ్డికి తెలియదా అని ప్రశ్నించారు. రివ్యూలు చేయడానికి రూ.200 కోట్లతో భోదీ పెవిలియన్ కట్టుకున్న సీఎం 8 పథకాల జీవోలపై ఎందుకు రివ్యూ చేయలేదని నిలదీశారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌పై ఎవరూ కోర్టులో పిటీషన్ వేయలేదని తెలిపారు. అడ్వకేట్ జనరల్‌కు కేసును వాదించమని సీఎం ఎందుకు చెప్పలేదన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ నోడల్ ఏజెన్సీ పొన్నం ప్రభాకర్ అని.. ఆయనకు తాడు, బొంగరం ఉంటే పిటీషన్‌పై ఎందుకు రివ్యూ చేయలేదని ప్రశ్నించారు.

గ్రహచార భవన్‌లో కూర్చుని కాంగ్రెస్ వాళ్లు పూజలు చేపిస్తున్నారని ఆరోపించారు. రివ్యూ చేశారో లేదో గన్ పార్క్ వద్ద చర్చకు పొన్నం ప్రభాకర్, మంత్రులు సిద్ధమా అని సవాల్ విసిరారు. పథకాలను చంపాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని ఆరోపించారు. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందన్నారు. రేవంత్ దొర బిడ్డ అని.. మిగతా మంత్రులు ఏం చేస్తున్నారని నిలదీశారు. ఊర్లలోకి వచ్చే కాంగ్రెస్ వాళ్లకు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయమని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, సుమిత్రానంద్, సత్య, అబ్రార్ పాల్గొన్నారు.

# పార్లమెంటరీ వ్యవస్థను కాపాడాల్సిన వారే దెబ్బతీస్తున్నారు: ఎంపీ మల్లు రవి



విశ్వంభర, ఆమనగల్లు: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వ్యక్తిగతంగా, కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా కించపరిచే లక్ష్యంతో రాష్ట్రంలో గోబెల్స్ తరహా దుష్ప్రచారం సాగిస్తున్నారని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి విమర్శించారు. గురువారం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సంబంధిత కమిటీ నిబంధనలు, నిర్ణయాల ప్రకారమే సదరు కంపెనీకి భూమిని కేటాయించారని డాక్టర్ మల్లు రవి స్పష్టం చేశారు. వాస్తవాలను వక్రీకరిస్తూ ముఖ్యమంత్రిపై ఉద్దేశపూర్వకంగా బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయ ప్రయోజనాల కోసం చేస్తున్న ఇటువంటి నిరాధార ప్రచారాన్ని ప్రజలు నమ్మబోరని పేర్కొన్నారు. పార్లమెంట్ సమావేశాల నిర్వహణ తీరుపైనా ఎంపీ డాక్టర్ మల్లు రవి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశాల ప్రారంభం, చివరి రోజుల్లో మాత్రమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకు హాజరయ్యారని తెలిపారు. యువత ఆందోళనల సందర్భంగా జరిగిన కాల్పులు, లాఠీచార్జిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో సమాధానం చెప్పాలని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారని మల్లు రవి పేర్కొన్నారు. ప్రధానమంత్రి, హోంమంత్రి మాట్లాడాలనుకుంటే ఎప్పుడైనా సభకు వచ్చి సమాధానం చెప్పవచ్చని, కానీ వారు సభకు రాకుండా తప్పించుకున్నారని విమర్శించారు. భారత పార్లమెంట్‌కు ప్రపంచవ్యాప్తంగా ఎంతో గౌరవం ఉందని, పార్లమెంటరీ వ్యవస్థను కాపాడాల్సిన వారే దానిని బలహీనపరుస్తున్నారని డాక్టర్ మల్లు రవి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పడానికి భయపడే స్థాయి నుంచి సభకు రాకుండా తప్పించుకునే స్థాయికి కేంద్ర పాలకులు చేరుకున్నారని విమర్శించారు. దేశ ప్రజలు ఈ పరిణామాలన్నింటినీ గమనిస్తున్నారని, భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి పేర్కొన్నారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి సలహాదారు నరేందర్ రెడ్డి, ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, అంజన్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

# కర్నూలులో జగన్ పర్యటన.. 38 కి.మీ దూరానికి 5 గంటలు!



విశ్వంభర, కర్నూలు: వైసీపీ అధ్యక్షుడు జగన్ కర్నూలు జిల్లా జైలు వద్దకు చేరుకున్నారు. జైలులో ఉన్న ఆ పార్టీకి చెందిన ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షిని ఆయన పరామర్శించారు. పంచలింగాలలోని జిల్లా జైలు పరిసరాల్లో పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. వైసీపీ కార్యకర్తలు వాటిని తోసుకుంటూ జైలు గేటు వరకు వెళ్లారు. జగన్ పర్యటనలో ఎలాంటి రోడ్‌షోలకు కర్నూలు పోలీసులు అనుమతి ఇవ్వలేదు. ఓర్వకల్లు విమానాశ్రయం నుంచి కర్నూలు జైలు వరకు 38 కి.మీ దూరం చేరుకోవడానికి జగన్ సుమారు 5 గంటల సమయం తీసుకున్నారు. వైకాపా కార్యకర్తలు భారీ ర్యాలీగా వచ్చి అడుగడుగునా పోలీసు ఆంక్షల్ని ఉల్లంఘించారు. బళ్లారి చౌరస్తాలో హైవేపై డీజే పెట్టి బైక్‌లతో హల్‌చల్ చేశారు. దీంతో ఆ మార్గంలో ట్రాఫిక్‌జామ్‌తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# తెలంగాణ నీటి హక్కులను కేసీఆర్ బలి ఇచ్చారు

## : యెన్నం శ్రీనివాస్ రెడ్డి



విశ్వంభర, తెలంగాణ బ్యూరో: తన స్వలాభం కోసం, ఎంపీ సీట్ల కోసం, ఢిల్లీలో గద్దెనెక్కాలని తెలంగాణ రాష్ట్రాన్ని తాకట్టు పెట్టిన పార్టీ బీఆర్ఎస్ అని, తెలంగాణ ప్రయోజనాలకు వ్యతిరేకంగా కల్వకుంట్ల కుటుంబం పని చేసిందని ప్రభుత్వ విప్, యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. గురువారం సీఎల్పీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ సీఎంగా తెలంగాణ హక్కులను కాపాడవలసిన బాధ్యత ఉన్నా, ఆ పనిచేయకుండా, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లలో పార్లమెంట్ సీట్లను తెచ్చుకుని ఢిల్లీ గద్దెనెక్కాలని శాశ్వతంగా తెలంగాణకు నష్టం చేశారని ఆయన ఆరోపించారు. కేటీఆర్, హరీష్ రావు, జగదీష్ రెడ్డి మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని, తెలంగాణ వాటా కోసం రేవంత్ రెడ్డి ఎవరినైనా ఎదిరించడానికి సిద్ధంగా ఉన్నారని యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఏ విషయమైనా సరే కేసీఆర్ ని అసెంబ్లీకి వచ్చి డిబేట్ చేయమనండి..కాళేశ్వరం, కృష్ణా జలాల మోసం, జగన్మోహన్ రెడ్డికి నీళ్లు ధారదత్తం చేయడం.. ఇలా ఏ విషయమైనా సరే తాము చర్చకు సిద్ధమని ఆయన సవాల్ విసిరారు. డాక్యుమెంట్స్ అన్నీ ప్రజల ముందు పెడతామని, తాము తప్పు చేశామని మీరు ఒప్పించగలిగితే ఖచ్చితంగా సరిదిద్దుకుంటామని యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. గోదావరిలో 3000 టీఎంసీలు వృథాగా పోతున్నాయని, వాటిని ఆంధ్రాకు తరలిస్తామని, మహారాష్ట్రతో ఇచ్చి పుచ్చుకుందామని కేసీఆర్ మాట్లాడటం తెలంగాణ ప్రజలు మర్చిపోలేదని యెన్నం శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ తన స్వప్రయోజనాల కోసం, దేశ రాజకీయాల్లో చక్రం తిప్పడం కోసం తెలంగాణ నీటి హక్కులను బలి ఇచ్చారని, అందుకే ప్రజలు ఆయన్ని ప్రతిపక్షంలో కూర్చోబెట్టారన్నారు. ప్రస్తుతం ఎల్ నినో ఎఫెక్ట్ వల్ల కరువు ఉందని వర్షాలు తక్కువ పడతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారని తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెట్టి, కృష్ణా జలాల్లో 299 టీఎంసీల వాటా చాలని సంతకం చేసి రైతులకు మరణ శాసనం రాసింది కేసీఆర్ కాదా? అని యెన్నం శ్రీనివాస్ రెడ్డి నిలదీశారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు కేంద్రంతో పనిలేదని, రాష్ట్రాలతోనే డీల్ చేసుకుంటామని చెప్పి మన నీళ్లను వదిలేశారని, ఆ పాపాలను కప్పిపుచ్చుకోవడానికే ఇప్పుడు ఆరోపణలు చేస్తున్నారనిఆరోపించారు.

# రైతు బీమా ఎత్తేయడం దారుణం

## : మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



విశ్వంభర, తెలంగాణ బ్యూరో: రైతు బీమా ఎత్తేయడం దారుణమని.. కేసీఆర్ మీద కక్షతో రైతులకు అన్యాయం చేస్తారా అని మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఒక ప్రకటనలో ప్రశ్నించారు. రైతుబీమా ప్రీమియం గడువు ఈనెల 15తో ముగుస్తున్నా.. ఈ ప్రభుత్వం దానిని కొనసాగించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. రైతుబీమా పథకం ద్వారా లక్ష 21,099 మంది రైతు కుటుంబాలకు లబ్ధి చేకూరిందని.. ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున రూ.5909.85 కోట్ల పరిహారం అందిందని పేర్కొన్నారు. ఇంటింటికీ ఇందిరమ్మ బీమా పేరుతో రైతు బీమాను ఎత్తేస్తున్నారని.. దానిని ప్రతి ఇంట్లో ఒకరికి మాత్రమే పరిమితం చేస్తున్నారని ఆరోపించారు. జూన్ 2 నుండి పథకం అమలు అని ప్రకటించి, కోట్ల రూపాయలు ప్రకటనలు ఇచ్చారని.. ఇంతవరకు మార్గదర్శకాలు కూడా జారీ చేయలేదని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలు అని అరచేతిలో స్వర్గం చూపించి ఉన్న పథకాలను తొలగించారని పేర్కొన్నారు. కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ ఎత్తేశారని.. ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంతో కళ్యాణలక్ష్మికి కోర్టు బ్రేకులు వేసిందని తెలిపారు. అలాగే.. ఇప్పుడు రైతు బీమాను సైతం నిలిపేస్తున్నదని.. రైతు భరోసా ఇస్తారో ఇవ్వరో తెలియదని పేర్కొన్నారు. సాగునీళ్లు ఇవ్వరు.. యూరియా ఇవ్వరు.. పంటలు కొనుగోలు చేయరు.. బోనస్ ఇవ్వరు.. ఇలా అన్నింటినీ ఎగవేస్తూ కాలం వెల్లదీస్తున్నారని తెలిపారు. ఈ సర్కారుకు రైతుల ఉసురు తగులుతుందని హెచ్చరించారు.

# గేట్ వే ఆఫ్ పోర్టుగా బందరు

## : మంత్రి కొల్లు రవీంద్ర



విశ్వంభర, మచిలీపట్నం: మచిలీపట్నం పోర్టు పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. 2027 మార్చి నాటికి వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. గురువారం ఆయన పోర్టు పనులను పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ పనులు, రైల్వే ట్రాక్ నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. " 80 శాతం మేర నిర్మాణ పనులు పూర్తయ్యాయి. గత ప్రభుత్వం పోర్టును తీవ్ర నిర్లక్ష్యం చేసింది. బ్రేక్ వాటర్ వాల్‌కు సంబంధించి 95 శాతం పనులు జరిగాయి. 90 శాతం మేర నాలుగు బెర్త్‌ల నిర్మాణం పూర్తయింది. 70-80 శాతం అన్ షూర్ బిల్డింగ్ నిర్మాణాలు పూర్తయ్యాయి. రైల్వే ట్రాక్ నిర్మాణ పనులు కూడా ప్రారంభమయ్యాయి. త్వరలోనే పూర్తి స్థాయి డ్రెడ్జింగ్ పనులు ప్రారంభిస్తాం. దీనిపై త్వరలో సీఎం స్థాయిలో సమీక్షా సమావేశం నిర్వహించనున్నాం. గేట్ వే ఆఫ్ పోర్టుగా బందరు పోర్టు మారనుంది" అని తెలిపారు.

# ఆయిల్ పామ్ ప్లాంటేషన్ లక్ష్యం పూర్తి చేయాలి: కలెక్టర్



విశ్వంభర, సిరిసిల్ల: జిల్లాలో నిర్దేశించిన ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాన్ని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. గురువారం సిరిసిల్ల సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారులు, ప్రీ-యూనిక్ కంపెనీ, డ్రిప్ కంపెనీల ప్రతినిధులతో ఆయిల్‌పామ్ సాగు పురోగతి, లక్ష్య సాధనపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. 2026--27 ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు నిర్దేశించిన ఆయిల్‌పామ్ మొక్కల నాటే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. లక్ష్య సాధనలో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, క్షేత్రస్థాయిలో తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వారానికోసారి లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు వెళ్లాలని ఆదేశించారు. ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు కలిగే ఆర్థిక ప్రయోజనాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, సబ్సిడీలపై రైతులకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సహకారం సకాలంలో అందేలా ఉద్యానవన, వ్యవసాయ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అలాగే డ్రిప్ ఏర్పాటు, మొక్కల సరఫరా ప్రక్రియల్లో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత కంపెనీల ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యానవన అధికారి ఆర్. శరత్ బాబు, జిల్లా వ్యవసాయ అధికారిణి అఫ్జల్ బేగం, ఉద్యానవన శాఖ అధికారులు పాల్గొన్నారు.


# ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ వేగవంతం చేయండి

## : సీఈఓ వివేక్ యాదవ్




విశ్వంభర, ఏపీ బ్యూరో: రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ -2026 ప్రక్రియను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు లోబడి అత్యంత పారదర్శకంగా, వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) వివేక్ యాదవ్ ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో సీఈవో, అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు (డీఈఓలు) పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు, క్లెయిమ్‌ల పరిష్కార ప్రక్రియను మరింత క్రమబద్ధీకరించాలన్నారు. మ్యాపింగ్ చేయని ఓటర్లు, లోపాలు ఉన్న వారికి నోటీసులు జారీ చేయడం, విచారణలు పూర్తి చేయడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని స్పష్టం చేశారు. 'బుక్ ఎ కాల్' పెండింగ్ అంశాలు, ఎన్‌జీఎస్పీ ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని జిల్లాల అధికారులను ఆదేశించారు. ఓటర్ల సౌకర్యార్థం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఆగస్టు 22, 23, 29, 30 తేదీల్లో 'ప్రత్యేక ప్రచార దినాలు' నిర్వహించనున్నట్లు సీఈఓ వెల్లడించారు. ఈ నిర్ణీత ప్రచార దినాల్లో బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), రాజకీయ పార్టీల ప్రతినిధులు (బీఎల్ఏలు) పోలింగ్ కేంద్రాల్లోనే స్వయంగా అందుబాటులో ఉండి పౌరులకు ఓట్ల నమోదు, ఫారమ్‌ల పూర్తిపై మార్గదర్శకత్వం వహిస్తారని పేర్కొన్నారు. చట్టపరమైన నిబంధనలు పాటిస్తూ ఈ ప్రక్రియను పారదర్శకంగా ముగించాలన్నారు. 18-19 ఏళ్ల వయసు గల యువ ఓటర్ల నమోదుకు విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులకు సూచించారు. ఇందుకోసం అన్ని కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి, అర్హులైన ప్రతి యువకుడికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారులను ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్షలో అదనపు, డిప్యూటీ డీఈఓలు పాల్గొన్నారు. 30 ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా జూన్ 15 నుంచి జులై 24 మధ్య మీ వివరాలు నింపిన ఎన్యూమరేషన్ ఫాంలను బూత్ స్థాయి అధికారులకు ఇంకా సమర్పించ లేదా? తాజాగా విడుదలైన ముసాయిదా ఓటరు జాబితాలో మీ పేరు లేదా? మీ పేరు జాబితాలో ఉన్నా పేరు, వివరాలు, చిరునామాల్లో ఏమైనా తప్పులు, సవరించాలా? లేకుంటే మార్పులు చేయాలా? జాబితాలోని అనర్హుల పేర్లపై అభ్యంతరం చెప్పాలా? వీటిపై దరఖాస్తు చేసుకునేందుకు, అభ్యంతరాలు సమర్పించేందుకు ఎన్నికల సంఘం మరోసారి అవకాశం కల్పించింది. ఓటర్లు, రాజకీయ పార్టీల బూత్‌స్థాయి ఏజెంట్లు-బీఎల్ఏ ఎవరైనా క్లెయిమ్‌లు, అభ్యంతరాలు సమర్పించేందుకు ఆగస్టు 30 వరకూ సమయం ఇచ్చింది.

# 190 కిమీ ఔటర్, 96 కిమీ ఇన్నర్ రింగురోడ్డు కేంద్రం మంజూరు చేసింది: సీఎం చంద్రబాబు



విశ్వంభర, ఏపీ బ్యూరో: 2028 నాటికి భారత్ మెచ్చిన రాజధానిగా అమరావతిని ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. 190 కిలోమీటర్ల అవుటర్, 96 కిలోమీటర్ల ఇన్నర్ రింగురోడ్డును కూడా కేంద్రం మంజూరు చేసిందన్నారు. సింధూ నాగరికత తరహాలోనే రాజధాని నగరంలో సీడ్ యాక్సెస్ రహదారులు నిర్మాణం జరుగుతున్నాయన్నారు. 2047 నాటికి ఏపీని స్వర్ణాంధ్ర చేయాలన్న సంకల్పం తీసుకున్నామన్న సీఎం, మరి మీరు ఏం సంకల్పం చేస్తారని ప్రశ్నించారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చేతిలో జాతీయ జెండా, మనస్సులో అజెండాతో సాధించాల్సిన లక్ష్యాన్ని సంకల్పం చేయాలని సూచించారు. అనునిత్యం ప్రజల సంకల్పాన్ని నెరవేర్చుకునే ఆలోచనలు చేస్తే రాష్ట్రాభివృద్ధి, దేశాభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. మనకు స్వాతంత్ర్యం ఎందుకు వచ్చిందో అంతా మర్చిపోతున్నామని అన్నారు. కేవలం జెండా వందనం ఒక్కటే కాదు దేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టటం ముఖ్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. రైతులు, విద్యార్థులు, కార్మికులు, వ్యాపారులు ఎవరైనా తమ ప్రాంతాల్లో కృషి చేయాలని కోరారు. ప్రతీ ఇల్లు, వాణిజ్య సంస్థ పైనా జాతీయ జెండా ఎగరాలన్నారు. మండల, అసెంబ్లీ నియోజకవర్గాలు, జిల్లాల్లో తిరంగ ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. ఓ ప్రజా ఉద్యమంగా తిరంగ ర్యాలీ జరగాలని, వచ్చే 21 ఏళ్లలో వికసిత్ భారత్?గా తయారు కావాలని చంద్రబాబు ఆకాంక్షించారు. 2047 నాటికి స్వర్ణాంధ్రగా ఏపీ తయారు కావాలని, ఆ శక్తి సామర్థ్యాలను ప్రజలే అందించాలని కోరారు. అమరావతి రాజధాని అభివృద్ధికి ప్రజలూ ఆలోచనలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. అమరావతి ఆర్థిక రాజధానిగా మారాలి. స్వాంతంత్ర్య దినోత్సవ స్ఫూర్తిని ప్రజలంతా అందిపుచ్చుకోవాలన్నారు. సీడ్ యాక్సెస్ రహదారి, స్టీల్ బ్రిడ్జిలతో మొదటి మెట్టు ఎక్కామని చంద్రబాబు వెల్లడించారు. రాజధాని అమరావతికి రాజమార్గంగా చెబుతున్న సీడ్ యాక్సెస్ రహదారి ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. అమరావతి రవాణా వ్యవస్థకు వెన్నెముకగా నిలవనున్న జు-3 సీడ్ యాక్సెస్ రోడ్ రెండో దశను ముఖ్యమంత్రి చంద్రబాబు లాంఛనంగా ప్రారంభించారు.

# విజయవాడ-వారణాసి మధ్య నేరుగా విమాన సర్వీసులు..

## ప్రారంభించిన రామ్మోహన్



విశ్వంభర, విజయవాడ: ఏపీ ప్రజలకు మరో కీలక విమాన కనెక్టివిటీ అందుబాటులోకి వచ్చింది. విజయవాడ విమానాశ్రయం నుంచి వారణాసికి నేరుగా నూతన ఇండిగో సర్వీసులను పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు వర్చువల్‌గా ప్రారంభించారు. దీంతో రాష్ట్ర ప్రజలకు కాశీ యాత్ర మరింత సులభం కానుంది. ఈ విమాన సర్వీసులు వారానికి మూడు రోజుల పాటు అందుబాటులో ఉంటాయి. మంగళ, గురు, శనివారాలు ఈ నగరాల మధ్య విమానాలు నడపనున్నారు.ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. ప్రాంతీయ విమాన కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడంతో పాటు దేశంలోని టైర్-2, టైర్-3 నగరాలను ప్రధాన విమానాశ్రయాలకు అనుసంధానం చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విజయవాడ-వారణాసి మధ్య నేరుగా విమాన సర్వీసు ప్రారంభం రాష్ట్ర విమానయాన రంగంలో మరో కీలక ముందడుగని ఆయన పేర్కొన్నారు. విమాన ప్రయాణాన్ని ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకురావడం, ప్రయాణ సమయాన్ని తగ్గించడం, ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించడం ద్వారా ఈ కొత్త సర్వీసు ప్రజలకు మరింత ప్రయోజనం చేకూర్చనుందన్నారు. మరోవైపు హుస్సేన్ సాగర్, ప్రకాశం బ్యారేజ్, శ్రీశైలం జలాశయం మధ్య సీ ప్లేన్ ప్రాజెక్ట్ కోసం వ్యూహరచన సిద్ధం చేస్తున్నామని రామ్మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు కేశినేని శివనాథ్, బాలశౌరి, పౌర విమానయానశాఖ కార్యదర్శి సమీర్ కుమార్ సిన్హా, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఇండిగో ప్రతినిధులు పాల్గొన్నారు.